కథా నిలయం
3444
శ్రీకాకుళం

# పనిష్మెంట్

రెడ్డి గారి భవంతి వచ్చేపోయే జనంతో కోలాహలంగా ఉంది. పైరవీలకు, పంచాయతీలకు, తీర్మానాలకు ఆ ఇల్లు ఓ వేదిక. సూర్యోదయంతో వచ్చిన మోతీ అలాగే గేటు పిల్లర్‌కు అనుకుని కూర్చుంది.

మోతీ ముఖంలో నిరాశలు గూడు కట్టుకొని ఉన్నాయి. ముడుతలు పడ్డ ముఖం, జీవితంలోని కష్టాలకు గుర్తుగా నొసలుపై అడ్డంగా ఉన్నాయి.

కళ్ళల్లో ఏవో ఆశలు మిణుగురు పురుగుల్లా వెలుగుతున్నాయి.

కొడుకు రాముడు హత్యచేశాడని న్యాయస్థానం రుజువు చేసింది, అతనికి ఉరి శిక్ష కూడ విధించింది. ఆ ఆలోచనలతో మోతీ గుండెలు బరువెక్కు తున్నాయి. కొడుకు లేని తన చివరి జీవితాన్ని ఊహించుకో లేక పోతోంది.

కోర్టులో వకీళ్ళతో ఇక లాభం లేదని రాష్ట్రపతి క్షమాభిక్ష కోసం రాజారెడ్డి గారనే ఆ ప్రాంతపు యం. ఎల్. ఏ. గారిని ఆశ్రయించింది.

వారి దర్శనం కోసం ఎదురు చూస్తోంది. తనకున్న అయిదు ఎకరాల మెట్ట పొలం అమ్మి యం. ఎల్. ఏ. గారి దోసిట్లో పోసింది. కానీ అనుకున్నంత ఫలితం కనబడ్డం లేదు.

ఉరి తీసే గడువు సమీపిస్తోంది. మృత్యు గహ్వరం లోకి ప్రవే శించ నున్న కొడుకు జీవితాన్ని తలచుకొని ఎంతగానో ఏడుస్తోంది. భరించలేని బాధ గుండెను పిండేస్తుంటే రెండేళ్ళనుండి కంటికి నిద్రలేదు. కాలికి నిలకడ లేదు.

భర్త పోయాడన్న బాధ, కొడుకు చస్తాడన్న వ్యధ మోతీని కృంగ తీస్తున్నవి.

ఇంతలో రాజారెడ్డి గారు పెళ్ళిపీటలమీదికెళ్ళే పెండ్లి కొడుకులా వరండాలోకి వచ్చాడు. పెదవుల పై చిరునవ్వులు తొణికిసలాడు తున్నాయి. తెల్లని ఖద్దరు ధోవతి, సిల్కు లాల్చి అతని హుందాతనాన్ని చాటు తున్నాయి.

రాజారెడ్డిని చూడగానే దేవుణ్ణి చూసినంత పనయింది మోతీకి. అంతవరకు ఆపుకున్న దుఃఖం ఒక్కసారి పెళ్ళుబికింది.

"దొరా ! ఖర్చులకు భయపడకుండి, మిగిలిన ఆ చెలక నైనా అమ్మి నా కొడుకు ప్రాణాలు నిలబెట్టండి. ఏలాగైనా వాడు బ్రతకాలి" అంటూ తన నిశ్చయాన్ని వెలిబుచ్చింది.

కేసును ఆలోచిస్తూ సిగారు వెలిగించాడు ప్రజానాయకుడు.

మోతీ ఇంకా తన గోడును వెళ్ళగ్రక్కుతోనే వుంది. "వాని శని మూడింది. వాడి తండ్రిని వాడే చంపుకున్నాడు. మంది నేమైనా చంపాడా ?" అంటూ "లా"కు దొరకని పాయింటుతో ఏడుస్తూ మాట్లాడుతోంది.

అది విన్న రాజారెడ్డి "తను చావడానికి కూడ చట్టం ఒప్పుకోదు. అది హత్య అయినా, ఆత్మహత్యయినా నేరం, నేరమే. శిక్ష తప్పదు," అన్నాడు.

"చచ్చిన ముసలోడు ఏలాగో చచ్చిపోయ్ ! కనీసం వీడన్నా బ్రతకాలి గదా ! వాడి పెండ్లాం ఏడ్చి, ఏడ్చి సగం అయ్యింది. ఆని అత్తగారోళ్ళు కూడ కొంత డబ్బిస్త మంటున్రు. ఏదన్నచేసి నా కొడుకు ప్రాణం కాపాడు దొరా ! నీ ఆకిలి వూకి, నీ రుణం తీర్చుకుంటా" అంటూ మోతీ వెక్కి వెక్కి ఏడుస్తోంది.

అప్పుడే అక్కడికొస్తున్న కోడల్ని చూపిస్తూ- "అదిగో అదికూడ వస్తోంది. దాని ముఖం చూడు దొరా ! అది కుమిలి కుమిలి ఏడ్చి చస్తోంది. అది కాపురానికికొచ్చి కొద్దిరోజులైనా కాలేదు. వాడేమో జైలు పాలయ్యిండు. ఆనాటి నుంచి దాని కంటికి కునుకు లేదు. దాని ముఖం చూసైనా సరే, వాని ప్రాణం కాపాడండి."

నేలను చూస్తూ ఏడుస్తున్న కోడలు లచ్చిమి దగ్గరి కెళ్ళి తల నిమురుతూ-

"ఊర్కో-ఊర్కో-దొర ఏలాగైనా నీ పసుపు కుంకమ కాపాడుతాడు, ఏడవకు."

రాజారెడ్డి ఆమె వైపు చూస్తూ, ఇంత చిన్నవయసులో వచ్చిన ఆపదను ఆలోచిస్తూ, సిగార్ దమ్ములాగి పొగను గాలిలోకి వదిలాడు.

"ఇంకా ప్రయత్నం చేద్దాం - రేపు ముఖ్యమంత్రిని కలుద్దాం. ఆయన ద్వారా ఢిల్లీకి ఫోను చేయిద్దాం. ఈసారి తప్పకుండ అవుతుంది."

రాజారెడ్డి మాటలకు మోతీ ప్రాణాలు లేచివచ్చాయి. కోడలు కళ్ళలో కొత్త కాంతులు వెలిగాయి. మోతీ రెడ్డి కాళ్ళకు మొక్కుతోంది. కోడలు లచ్చిమి కొంగుతో కండ్లను తుడుచుకొంటుంది.

లచ్చిమికి పాతికేండ్లు. పసుపు పచ్చరంగు, నల్లని కళ్ళు, రెడ్డి చూపులు తడబడ్డాయి.

మనసులో ఏదో కదిలింది.

సిగారును నేలకేసి విసిరి, మోతీని దగ్గరికి పిల్చి చెవిలో ఏదో చెప్పాడు రెడ్డి.

"అమ్మో ! వద్దు దొరా !" అంటూ నోరు మూసుకుంది. మళ్ళీ చెప్పాడు రెడ్డి.

''అమ్మో ! అది నాతో కానిపని దొరా !'' అంటున్న మోతీకి వణుకు లాంటిది మొదలయ్యింది.

రాజారెడ్డి పెదాలపై ఓ మాదిరి నవ్వు నాట్యం చేసింది.

''ఇది మాత్రం నాతో అయ్యేపనా ?''

ఆ మాటలకు మోతీ కొంతసేపు రాయిలా నిలబడింది.

''అప్పటికి డబ్బులు తీసుకొని వస్తా !'' అంటూ కోడలితో వెళ్ళిపోయింది.

దారిలో రెడ్డిగారు తన చెవిలో చెప్పిన రహస్యాన్ని, కోడలు చెవిన వేసింది. అప్పుడు మోతీ కాళ్ళు వణికినవి. నాలికపై తడి ఆరి మాటలు తడబడ్డవి. అది విన్న లచ్చిమి బొమ్మలా నిలబడింది. అలా నిలబడ్డ లచ్చిమి కళ్ళ నుండి ఏకధారగా కన్నీరు జారుతోంది. ''భగవంతుడా ! నన్ను ముందు చంపు'' అన్నపుడు ముక్కు పుటాలు కదిలినవి. వేడి శ్వాస బైటికొచ్చింది.

''ఆయన ఏలాగూ చస్తాడు. నేనూ చస్తాను. కానీ ఈ పనిచేయ లేను.''

''ఎవ్వరూ చావ కూడదు. ఇద్దరూ బ్రతకాలి - అందుకే.'' మోతీ అసుకొని నిబ్బరంతో అంది.

''ఎట్లా బ్రతికేది, ఏం చేసేది ? ఆ తర్వాత ఈ ముఖం ఎట్లా చూపేది--ఈ కుంపటి ఎట్లా భరించేది ?''

''బ్రతకాలి-భరించాలి. నా భర్తను నీ భర్త చంపినా నేను కోర్టులో చంపలేదని సాక్షం ఇవ్వలేదా ?''

''ఆయన మాత్రం చంపాలని చంపాడా ? ఏదో మాటమీద మాట పెరిగి పెద్ద జగడమైంది.''

''ఏది ఏమైనా చంపిండా లేదా ? కోర్టులో అబద్ధం చెప్పినా్న లేదా ?''

''అది నీ కడుపు తీపి. అయినా నాకు చెప్ప నీకు నోరెలా వచ్చింది?'' అంటూ కుడిచేతితో తన నోరు మూసుకుంటూ ఏడుస్తోంది.

'' ఆ...ఆ కడుపు తీపే... ఆ నోరే... అదే నా భర్తను చంపినా, చంప లేదన్న ఆ నోరే, ఈ రోజు చెప్పేది. ''

''ఆపు అత్తా ... ఆపు'' అంటూ లచ్చిమి ఏడుస్తోంది.

''కానీ ... కానీ ... ఒక్కసారి ఆయనను చూసి వచ్చినంక.''

''ఎందుకు-ఈ విషయం వాడితో చెపుతావా ఏం ?''

'' లేదు ! ఆయన్ని చూసి రావాలి ! అంతే.''

*  *  *

జైల్లో విజిటర్సు గది -

గది బయట జవాను.

గదిలో రాముడు, లచ్చిమి. చుట్టూరా భయంకర నిశ్శబ్దం.

ఇద్దరి కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయి.

''అత్త - రెడ్డిగారితో మాట్లాడింది '' అంటూ లచ్చిమి కళ్ళ నీళ్ళు కార్చడం మొదలెట్టింది.

'' ఏమన్నాడు ?'' రావుడు.

''తప్పక ఇడిపిస్తా నన్నాడు --కానీ-- ''

''డబ్బులు కావాలన్నాడా ? ''

"చెలక నమ్మి డబ్బులు ఇస్తామన్నాం ......"

" మరి ? ... ... "

" ......... "

" చెప్పవేం ? ...

ఎలా చెప్పుతోంది, ఏమని చెప్పుతోంది ?

ఏడ్వటం తప్ప ...

"చలో ... చలో...టైమ్ హోగయా ..." జైల్ జవాను విదిలింపు.

"ఏదడిగినా ఇవ్వండి. ఎంతడిగినా ఇవ్వండి. చెలక...బావి... ... అన్నీ ..."

"కాదు ... అవేవీ కావు ......"

అంటూ నేలను చూస్తోంది.

కడుపులో కదిలిన దుఃఖం కనురెప్పలను తన్నుకొస్తోంది.

" నేను బ్రతకాలి ... "

" చలో ... చలో ... బాహర్ చలో ..."

రావుడు జైల్లోకి, లచ్చిమి బయటికి నడిచారు.

* * *

పట్టణంలో అధునాతన మైన హోటల్ గది. చాలా అందంగా, విలాసంగా ఉంది. మెత్తని డన్‌లప్ బెడ్‌పై తెల్లని బెడ్‌షీట్ పాలమీగడలా ఉంది. లచ్చిమి వలలో చిక్కుకున్న లేడిలా బెదురు బెదురుగా అదే బెడ్‌పై కూర్చుంది.

ఎదుటి సోఫాలో కూర్చున్న రాజారెడ్డి, కాలుతున్న సిగరెట్టును యాష్‌ట్రేలో నలిపి వదలి, వెళ్ళి లచ్చిమి ప్రక్కన కూర్చుంటూ "అబ్బ!

విరిసిన పువ్వులా ఉన్నావే''......అంటూ లచ్చిమి దగ్గరికి జరిగి కూర్చు న్నాడు.

లచ్చిమి గుండె వేగం హెచ్చినట్లయింది. రెండు చేతులతో తన గుండెను అదిమి పట్టుకుంది.

కళ్ళలో భయం, చూపుల్లో బెదురు, శ్వాసలో బాధ, వంటిలో వణుకు

ఆమె మనసులో అత్తా-భర్తరూపాలు కదిలాయి.

''ఎవ్వరు......చావకూడదు'' అత్త-

''నేను బ్రతకాలి'' భర్త -

బాధగా తలెత్తి చూసింది. వెలుగుతున్న ట్యూబ్‌లైట్ దగ్గర ఎగురుతున్న ఓ చిన్న మిడతను ప్రక్కనే పొంచి ఉన్న బల్లి నోట కరచి పట్టింది.

ఆయన లచ్చిమిని కసిగా తన కౌగిట్లో ఆదిమి పట్టాడు.

బల్లి నోటిలో ఉన్న మిడత గిలగిల తన్నుకొంటోంది.

అతని కౌగిలిలో ఆమె భయంగా, బాధగా శ్వాస వదులుతోంది.

బల్లి మిడతను చిదిమి-చిదిమి మ్రింగింది.

అతి దారుణంగా ఆ రాత్రి గడిచింది.

* * *

వారం గడిచాక ఓ ఉదయం రావుడిని ఉరి తీశారు. ఆవార్త విన్న మోతీ, ఏడ్చి, మూగదయింది. లచ్చిమి మాత్రం ఏడవడం లేదు నవ్వుతూ ఉంది.

* * *

కొన్నాళ్ళ తర్వాత మళ్ళీ ఎన్నికలొచ్చాయి. తండలోని గిరిజను లను ఉద్దేశిస్తూ రెడ్డి ''నేను రావునికి ఉరి శిక్షను తప్పించాలని, హైద్రాబాదు. అంతేకాదు ఢిల్లీకి తిరిగి తిరిగి ఎంత ప్రయత్నించినా ఫలించలేదన్న విషయం మీ అందరికీ తెలుసూ''